గ్రామ రక్షణకు చర్యలేవీ?

- పల్లిపాలెం తీరానికి రక్షణ కరవు
- గ్రోయిన్ల ఎత్తు పెంచాలని విజ్ఞప్తి
- కుంగిపోతున్న రివిట్‌మెంట్



పల్లిపాలెంలో గోదావరి ప్రవాహానికి సమాంతరంగా దిగబడిన గ్రోయిన్, రివిట్‌మెంట్

సఖినేటిపల్లి: మండలంలో వశిష్ట గోదావరి నదీ ఒడ్డునున్న పల్లిపాలెం గ్రామానికి నదీకోత నుంచి పూర్తి రక్షణ కల్పించాలని ఆ ప్రాంత వాసులు ముక్తకంఠంతో కోరుతున్నారు. సాగర సంగమంకు అత్యంత సమీపంలో వశిష్ట గోదావరి తీరాన్ని ఆనుకుని ఈ గ్రామం ఉండడంతో సముద్రం, గోదావరి కెరటాల ప్రభావం ఎక్కువగా ఉంటోంది. ప్రతి నెలలో పౌర్ణమి, అమావాస్యలకు ఉండే పోటు, పాటులతో పాటు, ప్రకృతి వైపరీత్యాలకు కెరటాలు రివిట్‌మెంట్‌ను దాటుకుని మరీ గ్రామం వైపునకు చొచ్చుకొని వస్తుండడంతో స్థానికులు భీతిల్లుతున్నారు.

రక్షణకు సహకరించని రివిట్‌మెంట్

నదీ పరివాహక ప్రాంతంలో సుమారు పుష్కర కాలం క్రితం నిర్మించిన గ్రోయిన్లు, వాటి మధ్య రివిట్‌మెంట్ కుంగిపోయి గ్రామానికి ముప్పుగా పరిణమించిందని స్థానికులు చెబుతున్నారు. అప్పట్లో నాటి పరిస్థితులకు అనుగుణంగా పాలకులు నిర్మించిన గ్రోయిన్లు ప్రస్తుతం నదీ గర్భంలో కలసిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నానాటికి దిగబడిపోతున్న గ్రోయిన్లు, చెల్లాచెదురవుతన్న రివిట్‌మెంట్ గ్రామ రక్షణకు సహకరించడం లేదని వారు వాపోతున్నారు.

కబళిస్తున్న వరదలు, వైపరీత్యాలు..

మండలంలో అంతర్వేది, పల్లిపాలెం, గొంది, గుడిమూల, రామేశ్వరం, సఖినేటిపల్లిలంక, సఖినేటిపల్లి, అప్పనరామునిలంక గ్రామాల్లోని గోదావరి తీరానికి ముప్పు వాటిల్లుతోంది. ప్రధానంగా పల్లిపాలెంలో ప్రకృతి వైపరీత్యాలకు తోడు ఏటా జూలై, ఆగస్టు నెలల మధ్యలో వచ్చే వరదల ఉధృతికి కూడా తీరం బలహీనపడి రివిట్‌మెంట్ రాళ్లు గోదావరి నదిలోకి జారిపోతున్నాయని స్థానికులు అంటున్నారు.

గతంలో రెండు దఫాలుగా రక్షణ పనులు..

సముద్రానికి అతి సమీపాన గ్రామ రక్షణకు 2001లో అప్పటి రాజోలు ఎమ్మెల్యే ఏవీ సూర్యనారాయణ రాజు గోదావరి నదీకోత నివారణకు 4 గ్రోయిన్లు, వాటి మధ్య రివిట్‌మెంట్ నిర్మాణ పనులు పూర్తి చేయించారు. అలాగే 2008లో అప్పటి రాజోలు ఎమ్మెల్యే అల్లూరు కృష్ణంరాజు మరో 4 గ్రోయిన్ల నిర్మాణం పనులు పూర్తి చేయించారు. అయితే రానురాను విపత్తుల కారణంగా పెరుగుతున్న గోదావరి అలల ఉధృతికి బలహీనపడుతున్న తీరం రక్షణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అభ్యర్థిస్తున్నారు. పల్లిపాలెం చేపలరేవు వద్ద నుంచి గ్రామ శివారు పదో వార్డు వరకూ సుమారు కిలోమీటరు పొడవు ఉన్న తీరంలోని 8 గ్రోయిన్లు ఎత్తు పెంచి, వాటి మధ్య చెల్లాచెదురవుతున్న రివిట్‌మెంట్ రాళ్లను పటిష్ట పరచాలని వారు కోరుతున్నారు.



పల్లిపాలెం పుష్కరరేవు వద్ద చెల్లాచెదురైన రివిట్‌మెంట్

పనులకు ప్రతిపాదనలు పంపాం

నదీకోత నుంచి గ్రామాల రక్షణ పనులకు ప్రతిపాదనలు పంపాం. ఇందుకు సుమారు రూ.200 కోట్ల మేర అంచనాలు రూపొందించాం. సఖినేటిపల్లి బోను వద్ద నుంచి సఖినేటిపల్లి రేవు వరకూ మూడు కిలోమీటర్ల మేర, అంతర్వేది–పల్లిపాలెం లిమిట్స్‌లో మరో మూడు కిలోమీటర్ల మేర గ్రోయిన్లు, రివిట్‌మెంట్‌కు ప్రతిపాదించాం.

– టీవీఎల్ఎస్ మూర్తి, హెడ్‌వర్క్స్ ఏఈ, రాజోలు

నదీ కోతకు అడ్డుకట్ట దిశగా చర్యలు



నదీ కోత నుంచి గ్రామాల రక్షణకు తగిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే నదీ పరివాహక ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితులను క్షేత్ర స్థాయిలలో పరిశీలించాం. దీనిపై అధికారులకు తగిన సూచనలు చేశాం.

– దేవ వరప్రసాద్, ఎమ్మెల్యే, రాజోలు

ప్రొటోకాల్ పాటించకుండా అవమానిస్తారా?

అంబాజీపేట: ప్రభుత్వం చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో ప్రొటోకాల్‌ను విస్మరించి ఎంపీపీ, జెడ్పీటీసీలు ఇరువురిని ఎలా అవమానిస్తారంటూ ఎంపీడీఓ వి.సరోవర్‌పై ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అసహనం వ్యక్తం చేశారు. అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలో పల్లెపండుగలో భాగంగా రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేసేందుకు మంగళవారం వచ్చారు. కార్యక్రమాల వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో ఎంపీపీ, జెడ్పీటీసీల ఫొటోలు లేకపోవడంతో ఎంపీపీ అసహనానికి గురయ్యారు. ఈ విషయమై ఎంపీడీఓను ఎంపీపీ నిలదీశారు. దీనిపై ఎంపీడీఓను వివరణ కోరగా ఫొటోలు ముద్రించకపోవడంలో తప్పిదం జరిగిందని, ఇకపై ఇటువంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుని, తగిన ఆదేశాలు జారీ చేస్తామన్నారు.

అన్నసమారాధనలు

అంబాజీపేట/పి.గన్నవరం: దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకొని మాచవరం మెట్లకాలనీ, పి.గన్నవరం మానేపల్లి దుర్గమ్మ ఆలయాల వద్ద మంగళవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. అంతకుముందు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మాచవరం పక్షుల రావిచెట్టు వద్ద నెలకొల్పిన అమ్మవారికి పూజలు జరిపారు.

క్లుప్తంగా

18న భూములకు కౌలు వేలం

మామిడికుదురు: అప్పనపల్లి గ్రామ దేవత కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి చెందిన 3.35 ఎకరాల కొబ్బరి చెట్ల ఫలసాయం తీసుకునే హక్కు కోసం ఈ నెల 18 శుక్రవారం వేలం జరుగుతుందని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ తులా నాగరాజు మంగళవారం తెలిపారు. 2024–25 నుంచి 2026–27 వరకు మూడేళ్ల కాల పరిమితికి 18వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు దేవస్థానం వద్ద దేవదాయ, ధర్మదాయ శాఖాధికారుల పర్యవేక్షణలో వేలం జరుగుతుందన్నారు. ఔత్సాహికులు ధరావతు సొమ్ము రూ.25 వేలు, రూ.మూడు లక్షల విలువైన సాల్వెన్సీ సర్టిఫికెట్ తీసుకుని పాటలో పాల్గొనాలని కోరారు. ఇతర వివరాల కోసం దేవస్థానం కార్యాలయం పనివేళల్లో సంప్రదించాలని నాగరాజు సూచించారు.

'కడలి' ట్రస్ట్ సేవలు అభినందనీయం



విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్న కడలి సత్యనారాయణ

రాజోలు: కడలి సేవా ట్రస్ట్ సేవలు అభినందనీయమని రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు అన్నారు. మంగళవారం కడలి సేవా ట్రస్ట్ ద్వారా కళాశాలలోని నిరుపేద విద్యార్థులకు రూ.50 వేల ఆర్థిక సాయాన్ని ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ అమలాపురానికి చెందిన రిటైర్డ్ సీబీసీఐడీ డీఎస్పీ కడలి సత్యనారాయణ అందజేశారు. ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులకు ఆర్థిక సాయం అందించడంపై ప్రిన్సిపాల్ సాయిబాబు, అధ్యాపకులు సత్యనారాయణ సేవలను కొనియాడారు. ఆర్థిక సాయం ద్వారా 10 మంది విద్యార్థులకు ఫీజులు చెల్లిస్తామన్నారు. వైస్ ప్రిన్సిపాల్ పద్మనాభం, అధ్యాపకులు నల్లి రాజు, సరిత, శైలజ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.10,116 విరాళం



దాత చరణ్‌కు స్వామి చిత్రపటం అందజేస్తున్న అర్చకుడు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి కొత్తపేట మండలం వానపల్లికి చెందిన కె.చరణ్ కుటుంబ సభ్యులు మంగళవారం రూ.10,116 విరాళం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అర్చకులు వినాయకరావుకు అందించారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయసిబ్బంది తదితరులు అభినందించారు.

వచ్చే నెల 17న వనసమారాధన

అంబాజీపేట: కుమ్మర శాలివాహన కార్తిక వనసమారాధన కార్యక్రమాన్ని వచ్చే నెల 17న అందరం కలసికట్టుగా ఘనంగా నిర్వహిద్దామని కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం నిర్ణయించింది. మాచవరం కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘ భవనంలో మంగళవారం సంఘ సమావేశం జరిగింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు మానేపల్లి వీరబ్రహ్మం, దాలిపర్తి భీమేశ్వరరావు మాట్లాడుతూ సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో వనసమారాధన నిర్వహణకు తీర్మానం చేశామన్నారు.

ఆర్ఐగా సుజాత



రావులపాలెం: మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పి.సూర్యకాంతం (సుజాత) మంగళవారం బాధ్యతలు చేపట్టారు. కొత్తపేట ఆర్డీవో ఆఫీస్ లో సీనియర్ అసిస్టెంట్ పనిచేస్తూ ఆర్ఐగా రావులపాలెం బదిలీ అయ్యారు.

పల్లె పండుగ కార్యక్రమాలు

మలికిపురం: మండలంలో పల్లెపండుగ, పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా ఆయా గ్రామాలలో మంగళవారం పల్లెపండుగను అధికారులు నిర్వహించారు. ఇందులో ఎస్ఆర్‌జీఎస్ పథకం, 15వ ఆర్థిక సంఘం గ్రాంటు నుంచి మంజూరైన రోడ్డు పనులకు మలికిపురం, కత్తిమండ, లక్కవరం, రామరాజులంక, దిండి గ్రామాలలో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ శంకుస్థాపనలు నిర్వహించారు. ఎంపీపీ మేడిచర్ల సత్యవాణి, ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జి పెదకాపు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఫైలేరియా నిర్ధారణ నమూనా పరీక్షలు

రావులపాలెం: ఫైలేరియా నివారణలో భాగంగా మంగళవారం రాత్రి ఊబలంక పీహెచ్‌సీ పరిధిలో వైద్య సిబ్బంది రక్త నమూనాలు సేకరించారు. సూపర్‌వైజర్ ప్రసన్నకుమార్, ఏఎన్ఎం ధనలక్ష్మి, ఆశలు, అనిత సుజానా ఇంటింటికీ తిరిగి రక్త నమూనాలు సేకరించారు.

18న విజయ బేతాళ స్వామి వాహనోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న సంఘ, ఉత్సవ నాయకులు

అంబాజీపేట: దశమి నవరాత్రులను పురస్కరించుకుని అంబాజీపేటలో నిర్వహించే విజయ బేతాళ స్వామి వాహన మహోత్సవం, తీర్థంను ఈ నెల 18న జరపనున్నట్లు శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘ అధ్యక్షుడు దొమ్మేటి రామారావు, ఉత్సవ కమిటీ చైర్మన్ శీలం సత్యఅర్జున మోహనరావులు తెలిపారు. స్థానిక శ్రీనివాసనగర్‌లో ఉన్న బేతాళ స్వామి ఆలయం వద్ద 13 పాలాల పెద్దలు, యువకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ నెల 16వ తేదీన నిర్వహించవలసిన బేతాళ స్వామి వాహన మహోత్స వేడుకలను బంగాళాఖాతంలో ఏర్పడిన వాయగుండం కారణంగా 18వ తేదీకి మార్పు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఉత్సవాన్ని, తీర్థాన్ని జరుపుకొందామని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘ కార్యదర్శి మట్టపర్తి రాము, దొమ్మేటి సత్యమోహన్, విత్తనాల ఇంద్రశేఖర్, దొమ్మేటి శ్యామ్, మట్టపర్తి సోమేశ్వరరావు, 13 పాలాల పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

లో వోల్టేజీ సమస్యను పరిష్కరించాలి



తొండవరంలో లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే సత్యనారాయణకు వివరిస్తున్న మహిళలు

అంబాజీపేట: లో వోల్టేజీ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఏ అధికారి పట్టించుకోవడం లేదని సత్యవతి కాలనీకి చెందిన మహిళలు పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు వివరించారు. పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల పేరిట చేపట్టిన గ్రామీణ ఉపాధిహామీ పనులకు ఎమ్మెల్యే సత్యనారాయణ మంగళవారం భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అభివృద్ధిపై దృష్టి పెట్టామన్నారు. పల్లె పండుగ పేరుతో గ్రామాలు అభివృద్ధి బాట పట్టిస్తామన్నారు. వాకలగరువులో 5 పనులకు రూ.25 లక్షలు, తొండవరంలో 9 పనులకు రూ.25 లక్షలు, నందంపూడిలో 2 పనులకు రూ.9 లక్షలు, మాచవరంలో 7 పనులకు రూ.49 లక్షలు, కె.పెదపూడిలో 3 పనులకు రూ.18 లక్షలు, చిరతపూడిలో ఒక పనికి రూ.10 లక్షలు, ఇసుకపూడిలో 5 పనులకు రూ.20 లక్షలను గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి మంజూరయ్యాయన్నారు. 15వ ఆర్థిక సంఘ నిధులతో ఈ పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు నాగాబత్తుల శాంతకుమారి, పేరాబత్తుల దొరబాబు, మద్దింశెట్టి దొరబాబు, ఎంపీటీసీ వాకపల్లి దొరబాబు, గణపతి వీర రాఘవులు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, బొంతు పెదబాబు, మైపాల తాతాజీ, నాగాబత్తుల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అధికంగా వాడితే అనర్థమే..



ముక్కామలలో రైతులకు సూచనలు ఇస్తున్న జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు

అంబాజీపేట: ప్రస్తుత కాలంలో వరి పంటకు ఎరువులు అధికంగా వినియోగించడం వల్ల అనర్థాలు చోటు చేసుకుంటాయని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు అన్నారు. ముక్కామల, కముజువారిలంక రైతు సేవా కేంద్రాల వద్ద పొలం పిలుస్తోంది కార్యక్రమాలు ఏఓ సీహెచ్‌డీ విజయ్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. బోసుబాబు మాట్లాడుతూ ఎరువులు అధికంగా వాడటం వల్ల పురుగులు, తెగుళ్లు ఎక్కువగా వస్తాయన్నారు. నత్రజని ఎరువు తగ్గించి వాడాలని రైతులకు సూచించారు. పొటాష్ ఎరువును దమ్ములోను, చిరు పొట్ట దశలోను వేయాలని రైతులకు వివరించారు. ఆకు ఎండు తెగులు, పొడ తెగులు నత్రజని ఎరువు ఎక్కువగా వాడటం వల్ల వస్తుందన్నారు. వ్యవసాయాధికారులు సూచనలు పాటిస్తూ ఎరువులు వినియోగిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఏపీఎస్ రాజశేఖర్ మాట్లాడుతూ ఆకు ఎండుతెగులు, సుడిదోమ నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఆకు ఎండు తెగులు సోకిన పొలంలో ప్లాంటోమైసిన్ 100 గ్రాములు, కాపర్ ఆక్సీక్లోరైడ్ 450 గ్రాములు కలిపి పిచికారీ చేయాలన్నారు. సుడిదోమ నివారణకు ఇమిడాక్లోప్రిడ్, మైమెట్రిజైన్ దీనిలో ఫ్యూరాన్ అనే మందులో ఏదో ఒక మందు పిచికారీ చేయాలని రైతులకు వివరించారు. పి.గన్నవరం ఏడీఏ ఎస్‌జేవీ రామమోహనరావు మాట్లాడుతూ పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సరస్వతుల సుబ్రహ్మణ్య ప్రసాద్, జిల్లా వనరుల కేంద్ర ఏఓ మనోహర్, ఏఈఓ డి.దుర్గారావు, హెచ్ఈఓ వెంకటేశ్వరరావు, పశువైద్యాధికారి జీఆర్ఎస్ శ్రీనివాస్, రైతులు బొక్కా శ్రీనివాసరావు, గుబ్బల సత్యనారాయణ, మానేపల్లి శ్రీనివాసరావు, వక్కపట్ల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప స్వామి పడిపూజ



కొత్తపేటలో కలశాలతో ఊరేగుతున్న అయ్యప్ప మాలధారులు

కొత్తపేట: స్థానిక గౌతమి అయ్యప్పస్వామి వారి ఆలయం వద్ద మంగళవారం 54 కలశాలు, పడిపూజ మహోత్సవం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. మండల దీక్ష చేపట్టిన అయ్యప్ప భక్తులు వివిధ పూజల్లో భాగంగా స్థానిక అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో పడిపూజ నిర్వహించారు. దానిలో భాగంగా ఉదయం నుంచి రాత్రి వరకూ పలు కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం వందలాది మంది అయ్యప్ప దీక్షాధారులు స్థానిక బోడిపాలెం వద్ద బొబ్బర్లంక–ముక్తేశ్వరం కాలువలో స్నానమాచరించి, కలశాలతో జలాన్ని శిరస్సుపై ఉంచుకుని అయ్యప్ప నామస్మరణతో ఊరేగారు. రాత్రి వేదపండితుడు బ్రహ్మశ్రీ కారుపర్తి కోటేశ్వరరావు వేద మంత్రోచ్చారణ నడుమ 54 కలశాలతో పడిపూజ నిర్వహించారు. అనంతరం మానేపల్లికి చెందిన అయ్యప్ప సంకీర్తనాచార్యుడు ప్రకాష్ గురుస్వామి పాటలతో భక్తులను తన్మయత్వంతో మైమరపించారు. అయ్యప్ప మాలధారులు, భక్తులకు స్థానిక ప్రముఖ న్యాయవాది, మాజీ ఏపీపీ మద్దింశెట్టి వీవీఎస్ ప్రసాద్ వడి (అల్పాహారం) ఏర్పాటు చేశారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు



అంతర్వేది దేవస్థానం పంచాయతీ వద్ద ప్రదర్శిస్తున్న ఈ క్రాప్ నమోదు జాబితా



మండపల్లిలో మాట్లాడుతున్న ఏఓ పద్మలత

కొత్తపేట: వ్యవసాయ ఉద్యాన పంటల సాగులో మెళకువలు తెలుసుకోవడం ద్వారా తక్కువ పెట్టుబడితో ఆధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) పి.పద్మలత రైతులకు సూచించారు. మండలంలోని మండపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం మంగళవారం ఏఓ పద్మలత అధ్యక్షతన జరిగింది. ఆమె మాట్లాడుతూ రైతులకు ఆధునిక వ్యవసాయ, సాంకేతిక సమాచార పరిజ్ఞానాన్ని చేరువ చేయడం వంటివి ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. పంట నమోదు, ఈ–కేవైసీ చేయించుకోవాలని, అలా చేయించుకున్న రైతులకు మాత్రమే ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ, క్రాప్ లోన్, ఉద్యాన శాఖ పథకాల లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ఉద్యాన అధికారి జి.కోటేశ్వర రావు మాట్లాడుతూ మైక్రో ఇరిగేషన్ పథకాలను వివరించారు. అనంతరం క్షేత్ర సందర్శనలో భాగంగా సమీప లంక భూముల్లో అరటి, తదితర పంటలను పరిశీలించి ఈ కాలంలో వచ్చే తెగుళ్లు, తీసుకోవాల్సిన సస్య రక్షణ చర్యలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ వీడీసీ కన్వీనర్ సాదు చెంచయ్య, గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: అంతర్వేదికర, అంతర్వేది దేవస్థానం గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్‌లు పోతురాజు నరసింహారావు, కొండా జాన్‌బాబు అధ్యక్షతన రైతులతో సమావేశాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఇటీవల నిర్వహించిన వరి, కొబ్బరి పంటల ఈ–క్రాప్ నమోదు జాబితాను ఏవో పీవీ నరసింహారావు ప్రదర్శించారు. జాబితాపై అభ్యంతరాలు ఏమైనా ఉంటే తెలియజేయాలని రైతులకు ఆయన సూచించారు. ఎంపీటీసీలు బైరా నాగరాజు, చొప్పల బాబూరావు, పల్లిపాలెం సర్పంచ్ ఒడుగుశ్రీను, వెటర్నరీ, వ్యవసాయ, ఉద్యాన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకునేలా అబ్దుల్ కలాం చిత్రాలు



పెన్సిల్‌తో విద్యార్థినులు తీర్చిదిద్దిన కలాం చిత్రాలు

మామిడికుదురు: మాజీ రాష్ట్రపతి స్వర్గీయ అబ్దుల్ కలాం జయంతి పురస్కరించుకుని మంగళవారం అతడి చిత్రాలకు విద్యార్థినులు జీవం పోశారు. ఈదరాడ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థినులు కార్తిని, ఆఫ్రీన్, నాగశ్రీలు పెన్సిల్‌తో కలాం చిత్రాలను తీర్చిదిద్దిన తీరు అబ్బురపర్చింది. వారు స్వయంగా గీసిన అబ్దుల్ కలాం చిత్రాలను విద్యార్థుల ముందు ప్రదర్శించారు. ఎంతో మందికి ఆదర్శనీయుడైన అబ్దుల్ కలాం మహనీయుడనికి, అతని చిత్రాలను గీసి నివాళులర్పించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.సాయిబాబాబ ఆధ్వర్యంలో డ్రాయింగ్ టీచర్ బత్తుల శ్రీనివాస్ నేతృత్వంలో విద్యార్థులు ఈ చిత్రాలను తీర్చిదిద్దారు. ఈ విద్యార్థినులకు ఉపాధ్యాయులు, సహచర విద్యార్థులు అభినందించారు.

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి



పి.గన్నవరం సీహెచ్‌సీలో కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిబ్బంది

పి.గన్నవరం: భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్టు చైర్మన్ భీమాల వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో కలాం జయంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలాం చిత్రపటానికి ఆస్పత్రి సూపరింటెండెంట్ రాఘవేంద్రరావు, ట్రస్టు చైర్మన్ భీమాల తదితరులు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఆస్పత్రిలోని రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఆస్పత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శబ్ద కాలుష్యాన్ని నివారించాలి

ఆలమూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో శబ్ద కాలుష్యాన్ని పూర్తిగా నివారించాలని ఆలమూరు సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.అశోక్ అన్నారు. స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో మంగళవారం లైటింగ్ అండ్ డీజే సౌండ్ బాక్స్‌ల ఏర్పాటు చేసే నిర్వాహకులతో సమావేశం జరిగింది. ఎస్సై అశోక్ మాట్లాడుతూ ఇటీవల అమలాపురంలో ఒక యువకుడు డీజే సౌండ్ బాక్స్ ఎఫెక్ట్ వలన గుండెపోటు వచ్చి మృతి చెందిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. భవిష్యత్తులో మండలంలోని ఏగ్రామంలోనూ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నివారణ చర్యలు తీసుకునేందుకు సమష్టి కృషి అవసరముందన్నారు. నిర్వాహకులందరూ తప్పనిసరిగా నిబంధనలను పాటించాలన్నారు. అలాగే పండగ, పర్వదినాలు, జాతరలో ఎటువంటి అశ్లీల నృత్యాలు జరగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. అలాగే శబ్ద కాలుష్యం కాకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

అనారోగ్య బాధితుడికి సాయం



బాధితుడికి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు మంగళవారం రూ.11,500 ఆర్థిక సాయం అందజేశారు. మండపేటకు చెందిన చింతా కిరణ్‌కుమార్ (28) తలలో నీటి బుడగ రావడంతో సర్జరీ చేయాలని వైద్యులు తెలిపారు. ఈ చికిత్సకు రూ.7 లక్షలు ఖర్చవుతుందన్నారు. దాతల సహకారం కోరగా రూ.3 లక్షలు సమకూరడంతో మరో రూ.4 లక్షలు అప్పు చేసి సర్జరీ చేయించారు. ప్రస్తుతం ఇల్లు గడవడం కష్టంగా ఉండడంతో కాశీ అన్నపూర్ణా దేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. సభ్యులు మండపేట వెళ్లి కిరణ్ కుమార్‌కి రూ.11,500 చెక్కు, 25 కేజీల బియ్యం బస్తా అందజేశారు.

డివిజన్‌లో రెవెన్యూ కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

కొత్తపేట: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు నేపథ్యంలో స్థానిక డివిజనల్ రెవెన్యూ కార్యాలయంతో పాటు, 7 మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్టు ఆర్డీవో పి.శ్రీకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధిక వర్షాలకు సంబంధించి ప్రజలకు ఏ విధమైన సమస్యలు ఉన్నా నేరుగా కంట్రోల్ రూమ్ నంబర్లకు కాల్ చేసి తెలపాలని పేర్కొన్నారు.

కార్యాలయం	కంట్రోల్ రూము నంబరు
ఆర్‌డీఓ	08855 244299
తహసీల్దార్ కార్యాలయం	**కంట్రోల్ రూమ్ నంబర్**
కొత్తపేట	9059461848
అయినవిల్లి	9491575700
ఆలమూరు	8839507819
అంబాజీపేట	8142434999
ఆత్రేయపురం	8008803202
పి.గన్నవరం	9010143248
రావులపాలెం	7780652319

బాలికను మోసగించిన యువకుడి అరెస్ట్

కొత్తపేట: ప్రేమ పేరుతో బాలికను మోసం చేసిన యువకుడిని అరెస్టు చేసినట్టు ఎస్సై జి.సురేంద్ర తెలిపారు. అవిడి పెదపేటకు చెందిన వరసాల కృష్ణబాబు అదే గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలికతో 2018లో పరిచయం పెంచుకున్నాడు. ప్రేమ పేరుతో మోసగించి బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని బాలిక తన కుటుంబ సభ్యులకు చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోక్సో కేసు నమోదు చేశారు. డీఎస్పీ వై.గోవిందరావు విచారణ జరిపి, నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా 15 రోజులు రిమాండ్ విధించినట్టు ఎస్సై సురేంద్ర తెలిపారు.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక



ఫెన్సింగ్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు

రాజోలు: జిల్లా స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో ప్రతిభ చూపిన రాజోలు బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయిని కె.సరస్వతి తెలిపారు. బట్టేలంక ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అండర్–14 విభాగంలో గోనమండ ప్రవీణ్ కుమార్, మల్లాడి ప్రదీప్ శ్రీశివసాయి, అండర్–17 విభాగంలో గుడాల నిఖిల్, గోనమండ నవీన్ కుమార్, పెమ్మాడి ప్రసన్నకుమార్‌లు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. రాష్ట్రస్థాయి పోటీలు ఈ నెల 17వ తేదీ నుంచి 19వ తేదీ వరకు నంద్యాలలో జరుగుతాయని పీడీ సీహెచ్ ప్రసాద్ తెలిపారు.